క్లుప్తంగా

సీఐగా రవికుమార్



సీఐ రవికుమార్‌ను అభినందిస్తున్న ఎస్‌ఐ

భోగాపురం: భోగాపురం పోలీస్‌స్టేషన్ సీఐగా ఎ.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విశాఖపట్నం సీటీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పి.తాతారావు, సిబ్బంది ఆయనకు మొక్కను అందజేసి అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో సరుకుల పంపిణీ

విజయనగరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని బాలింతలు, పసిపిల్లలకు అందేలా కేంద్రాల నిర్వాహకులు శ్రద్ధ వహించాలని అర్బన్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎర్రయ్యమ్మ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలో భాగంగా శుక్రవారం ధర్మపురి 3వ కేంద్రంలో ఆమె తనిఖీలు నిర్వహించి స్వయంగా సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా పిల్లలు, బాలింతలకు అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాజరైన బాలింతలను కోరారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకురాలు రమాదేవి, సహాయకురాలు బాలి మాణిక్యాల దేవి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అభివృద్ధి ప్రణాళికలు



డీపీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఓపీఆర్‌డీ, కార్యదర్శులు

పూసపాటిరేగ: గ్రామాలను అభివృద్ధి పథంలో పయనింపజేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై కార్యదర్శులు అవగాహన చేసుకోవాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కార్యదర్శులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ శ్రీనివాసురావుతో పాటు పలువురు కార్యదర్శులు వున్నారు. అంతకు ముందు పంచాయతీ కార్యదర్శులు డీపీఓ శ్రీధర్‌రాజాకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఏకసభ్య ధర్మకర్తగా పీడీ లక్ష్మి



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీడీ లక్ష్మి

డెంకాడ: జొన్నాడ పైడితల్లి అమ్మవారి ఆలయం ఏకసభ్య ధర్మకర్తగా దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు పీడీ లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ విశాఖపట్టణం ఉప కమిషనర్ ఆదేశాల మేరకు ఏక సభ్య ధర్మకర్తగా లక్ష్మి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోరాడ రమణి, ఎంపీటీసీ సభ్యురాలు త్రిపురగిరి దేవి, గ్రామపెద్దలు కోరాడ కోటినాయుడు, త్రిపురగిరి మురళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతికే ప్రజానిధి



నిధి వసూలు చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతి కోసమే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల వద్దకు వెళ్లి నిధి వసూలు చేస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కణపాక ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిధి వసూల్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు, నాయకులు పి.రమణమ్మ, ఎ.జగన్‌మోహన్, బి.రమణ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● నగరంలో ఫౌంటెన్ వెలుగులు

విజయనగరం జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవతో అందంగా ముస్తాబయ్యాయి. పలు ఫౌంటెన్లు విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. నగరవాసులతో పాటు నగరానికి వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ఎత్తుబ్రిడ్జి జంక్షన్ వద్ద రాజీవ్‌గాంధీ ఫౌంటెన్



బాలాజీ రోడ్డులో అంబేడ్కర్ ఫౌంటెన్



కలెక్టరేట్ పరిసర ప్రాంతంలో జ్యోతిబాపూలే ఫౌంటెన్



మయూరి కూడలి వద్ద టీ, కప్పు సాగర్ ఫౌంటెన్



కొత్తపేట జంక్షన్‌లో అలరిస్తున్న రాధాకృష్ణ ఫౌంటెన్



రింగ్‌రోడ్డులో అల్లూరి సీతారామరాజు ఫౌంటెన్



రింగ్‌రోడ్డు వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న ఏనుగు ఫౌంటెన్

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం



చింతలవలసలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

● ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

పూసపాటిరేగ/భోగాపురం(డెంకాడ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు.

డెంకాడ మండలంలోని మోపాడ, చింతలవలస, సింగవరం గ్రామాల్లో రూ.130 కోట్లతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా చింతలవలసలో 1.90 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిలు, మోపాడలో రూ.12 లక్షలు నాబార్డ్ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను, సింగవరంలో సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అవినీతి రహిత పరిపాలనను అందిస్తున్నామన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఎటువంటి అవినీతికి తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా అక్క చెల్మెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడమే కాకుండా ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. నాలుగో విడత మహిళ చేయూత నిధులను ఈ నెల 16న సీఎం జగన్ మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ బడ్డుకొండ లక్ష్మి, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మినాయుడు, ఏఎంసీ చిక్కాల అరుణ కుమారి, చిక్కాల సాంబ, జేసీఎస్ కన్వీనర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ఇంజిన్ భాగాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెకానిక్

భోగాపురం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పార్వతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆటోమోటివ్ ఒకేషనల్ శిక్షణలో భాగంగా శుక్రవారం హెచ్‌ఎం పార్వతి, ఒకేషనల్ శిక్షకుడు వి.చిరంజీవిరావు అధ్వర్యంలో స్థానిక శ్యామ్ ఆటో మొబైల్ గ్యారేజీని సందర్శించారు. గ్యారేజీలోని వివిధ రకాల ఇంజన్ పార్ట్స్ మరియు వాటి యొక్క పనితీరును ఆటో మెకానిక్ పోలవరపు ప్రకాశ్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆటోమోటివ్ కోర్సుకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

అందరి సహకారంతో నగర అభివృద్ధికి కృషి



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను మర్యాద పూర్వకంగా కలిసిన కమిషనర్ మల్లయ్యనాయుడు

● కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లయ్యనాయుడు

విజయనగరం: అందరి సహకారంతో విజయనగరం నగరాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. ఇటీవల మున్సిపల్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా విజయనగరం కార్పొరేషన్‌కు నియామకమైన మల్లయ్యనాయుడు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మిని కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, కౌన్సిల్ సభ్యుల సలహాలు, సూచనలతో కార్పొరేషన్ సిబ్బంది సమన్వయంతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే దిశగా పని చేస్తామన్నారు. గతంలో ఇక్కడ సేవలందించిన అనుభవంతో మరింత మెరుగైన పాలనను అందిస్తానన్నారు. నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో తన వంతు పాత్ర పోషిస్తానన్నారు. అలాగే సచివాలయాల పనితీరును మరింతగా మెరుగుపరిచి ప్రజలకు సులభతరమైన సేవలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యతనిచ్చి తదనుగుణంగా కార్యాచరణ రూపొందించి మెరుగైన పారిశుద్ధ్య విధానం అమలయ్యే విధంగా చూస్తానన్నారు. ప్రజా ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలను అందించేందుకు సంసిద్ధంగా ఉన్నానన్నారు.

నేడు రెల్లివలస సచివాలయ భవన ప్రారంభోత్సవం

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు హాజరవుతారని పేర్కొన్నారు. చల్లవానితోట, కుమిలి గ్రామాలలో వెల్‌నెస్ భవనాలను కూడా ప్రారంభించనున్నారని తెలిపారు. రెల్లివలసలో శ్మశానవాటిక, రెల్లివలస ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు.

వేగవంతంగా జలజీవన్ మిషన్ పనులు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భవాని

విజయనగరం రూరల్: ఇంటింటికీ కుళాయి అందించాలనే ధ్యేయంతో గ్రామాల్లో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులు వేగవంతం అయ్యేలా కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భవాని సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, గ్రామాఖ్య సమాఖ్య వీవోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీల ఏర్పాటు, వారి బాధ్యతలపై చర్చించారు. ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో బాల్య వివాహాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని చెప్పారు. ప్రసవ సమయంలో ఇబ్బంది పడతారని చెప్పారు. తరుచూ అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. అనంతరం బాల్య వివాహాలు అరికట్టడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డెన్ నాగమణి, రాధామణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రత్నం బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్: విజయనగరం తహసీల్దార్‌గా పీవీ రత్నం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల జోన్-1 పరిధిలో పలువురు తహసీల్దార్లకు స్థానచలనం జరగడంతో విజయనగరం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావును అనకాపల్లి తహశీల్దార్‌గా, విశాఖ జిల్లా వి.మాడుగుల తహసీల్దార్ పీవీ రత్నంను విజయనగరం తహసీల్దార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పీవీ రత్నంకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు



పినతరిమిలో కొనసాగుతున్న సీసీ రహదారి పనులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పినతరిమి గ్రామంలో సీసీ రహదారి నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఏళ్ల కాలం నుంచి గ్రామానికి సీసీ రహదారులు, డ్రైన్లు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మురుగు నీరు రహదారిపైనే నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజా ప్రతినిధులకు స్థానికులు పలుమార్లు మొర పెట్టుకున్నా సమస్యకు పరిష్కారం లభించలేదు. ప్రస్తుతం గ్రామంలో సీసీ రహదారులు నిర్మిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్ అంబళ్ల కిరణ్ రహదారి పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఆపస్ రాష్ట్ర కార్యదర్శి రామునాయుడు, ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూస్) ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం స్థానిక తోటపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఘనంగా జరిగింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామునాయుడు తొలిత సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం రామునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించుటకు సంఘం ఆవిర్భావం 1982 ఫిబ్రవరి 2 నుంచి కృషి చేస్తుందని కొనియాడారు. సంఘం లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ధనభూషణనాయుడు, టి.సత్యవాణి, సీహెచ్‌వీఎస్ఎన్ శర్మ, బి.లీల, రాము, అనురాధ, శివమాలతి తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టివి.రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టీసీ వద్ద మిమ్స్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజూ శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులకు 2020 అక్టోబర్ నుంచి బకాయి ఉన్న ఏడు డీఏలను వెంటనే చెల్లించాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులు ఇద్దరినీ భేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా బదిలీ చేసిన ఉద్యోగులకు మిమ్స్‌లోనే డ్యూటీలు ఇవ్వాలన్నారు. రెండేళ్ల సర్వీస్ దాటిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులపై వేధింపులు, కక్ష సాధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు కిల్లంపల్లి రామారావు, మిరప నారాయణరావు, వి. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



సత్కారం పొందిన హమాలీ కూలీల జట్టు యూనియన్‌ల సభ్యులతో చాంబర్ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ 75 సంవత్సరాలు పురస్కరించుకొని స్థానిక చాంబర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీడబ్ల్యూ.మార్కెట్‌లోని వివిధ హమాలీ కూలీల జట్టు యూనియన్‌ల అధ్యక్షులకు, పలువురు మేస్త్రీలకు చాంబర్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో పీడబ్ల్యూ మార్కెట్‌లోని యూనియన్‌లు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ అధ్యక్షులు మొదలి శ్రీనివాసరావు, బుగత అశోక్, 10 మంది జట్టు మేస్త్రీలు ఉన్నారు. ప్లాటినం జూబ్లీ కమిటీ చైర్మన్ ఎంపీచలం, కో-చైర్మన్ అశోక్ సోధానీ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాశ్, కార్యదర్శి రవ్వా శ్రీనివాస్, పూర్వాధ్యక్షుడు వి.చంద్రశేఖర్‌రావు, వీపీఎస్ ప్రసాద్, కె.సీతారామమూర్తి, ఉపాధ్యక్షుడు వి.సతీష్‌కుమార్, సహ కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, దాల్ మర్చంట్స్ ప్రతినిధులు కట్టమూరి ప్రభాకర్, రిటైల్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ పూర్వాధ్యక్షుడు వీవీ రమణమూర్తి, కట్టమూరి శంకరావు, మల్లిఖార్జునరావు, ఇతర సభ్యులు, రైస్ మర్చంట్స్ సభ్యులు పాల్గొన్నారు. రిటైల్ కిరణా మర్చంట్స్ అసోసియేషన్ మరియు రైస్ మర్చంట్స్ అసోసియేషన్ సహకారంతో కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలతో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు

డెంకాడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని విజయనగరం యూత్ ఫౌండేష్ అధ్యక్షుడు ఇల్తమాస్ అన్నారు. జిల్లాలో రక్త నిల్వల కారణంగా తలసేమియా, గర్భిణుల రక్తం అవసరాల సహాయార్థం మండలంలోని గుణుపూరుపేట గ్రామంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 53 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇల్తమాస్, సభ్యుడు రఘు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అందరూ రక్తదానం చేయవచ్చని వివరించారు. మీరు అందించే రక్తం ఎంతో మంది ప్రాణాలను నిలుపుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, రఘు, విజయ్, కళ్యాణ్, విజయ బ్యాంకు మేనేజర్ పుణ్యవంతుల శివ తదితరులు పాల్గొన్నారు.